# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నియోజకవర్గం పరిధిలో 239 పోలింగ్ కేంద్రాలు
- సున్నిత కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్‌తో నిఘా
- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గట్టి భద్రత
- ఎన్నికల అధికారి అపర్ణ



ఎన్నికల అధికారి అపర్ణ

అంబర్‌పేట, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. నేడు గురువారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఓటింగ్ యంత్రాలు, ఇతర సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు చేరుకుంది. అంబర్‌పేట నియోజకవర్గానికి సంబంధించి బర్కత్‌పురలోని రెడ్డి వుమెన్స్ కళాశాలను కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈవీఎంలను ఇక్కడే భద్రపరిచిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం కూడా ఈవీఎంలను ఇక్కడే స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తారు. ఈ సందర్భంగా పోలింగ్ ఏర్పాట్లపై నియోజకవర్గం ఎన్నికల అధికారి(ఆర్వో) అపర్ణ వివరాలను వెల్లడించారు.

**ఉదయాన్నే మాక్ పోలింగ్...**

గురువారం ఉదయం 6 నుంచి 6.30గంటల వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో మాక్ పోలింగ్ జరుగుతుంది. ప్రిసైడింగ్ ఆఫీసర్లు వీటిని నిర్వహిస్తారు. అభ్యర్థులు ఏజెంట్ల సమక్షంలోనే ప్రక్రియ సాగుతుంది. దాంతో ఓటింగ్ యంత్రాల పనితీరు స్పష్టం అవుతుంది.

**239 పోలింగ్ బూత్‌లు...**

నియోజకవర్గం పరిధిలో 239 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు ఆర్వో అపర్ణ తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారితో పాటు ఇద్దరు సహాయక సిబ్బంది ఉంటారన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వరు, వెబ్‌కాస్టింట్ అధికారి, బూత్ లెవెల్ అధికారి ఉంటారని చెప్పారు. 21 రూట్లలో 21 మంది రూట్ ఆఫీసర్లు, 21 మంది సెక్టార్ అధికారులు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. 34 సున్నిత పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌తో నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఈవీఎంలు ఏవైనా సతాయిస్తే వెంటనే వాటిని బాగు చేయడానికి ఈసీఐఎల్ నుంచి స్పెషల్ టీమ్స్ అందుబాటులో ఉంచామన్నారు.

**తరలింపు సజావుగా...**

ఈవీఎం, వీవీ ప్యాట్‌లను పోలింగ్ కేంద్రాలకు తరలింపు సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని ఆర్వో తెలిపారు. పెద్ద బస్సుల్లో వీరిని తరలిస్తున్నామని, ప్రతి బస్సుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

**దివ్యాంగుల కోసం...**

ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటు చేశామని ఎన్నికల అధికారి తెలిపారు. 239 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 98 భవనాల్లో దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు వేసేందుకు ఈసారి వీల్‌చైర్లు ఉంచామన్నారు. వీరిని ఇంటి నుంచి తీసుకువచ్చి మళ్లీ ఇంటి దగ్గర దించేందుకు ఆటోలు, వాహనాలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ర్యాంపులు పెట్టడం, వాలంటీర్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

**పోలింగ్ శాతం పెంచేందుకు కృషి..**

పోలింగ్ శాతం పెంచేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు ఆర్వో చెప్పారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించామన్నారు. అందరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ఉంటుందని చెప్పారు.

**నియోజకవర్గంలో 2,77,103 మంది ఓటర్లు...**

అంబర్‌పేట నియోజకవర్గంలో మొత్తం 2, 77.103 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఆర్వో అపర్ణ తెలిపారు. ఇందులో 1,40,206 మంది పురుషులు, 1,36,883 మంది మహిళలు, 14 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని చెప్పారు.

**అదనపు బలగాలతో గట్టి బందోబస్తు ..**

పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు కేంద్ర సాయుధ బలగాలతో గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నామని నోడల్ అధికారి, కాచిగూడ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద భద్రతకు సంబంధించి ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రతి ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు

కాచిగూడ,నవంబర్ 29: ప్రజాస్వామ్యం పటిష్టంగా ఉండాలంటే, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు విజ్ఞప్తి చేశారు. బుధవారం పీఎస్‌లో ఆయన మాట్లాడుతూ.. నేడు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న సందర్భంగా ఇతర జిల్లాల నుంచి ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, హోంగార్డులతో భారీ బందోబస్త్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 42 వేల మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కోసం మొత్తం 62 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్త్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రజలు శాంతి యుతంగా వ్యవహరించాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సమస్యలు తలెత్తితే 8712660540 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

## ఓటు వెయ్యండి.. ఉచిత శిక్షణ పొందండి

కాచిగూడ, నవంబర్ 29: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని టీసేవా సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి 'ఓటు వెయ్యండి..ఆన్‌లైన్‌లో శిక్షణ పొందండి' అని పిలుపు నిచ్చినట్లు తెలిపారు. ఓటు వేసిన వారికి సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్ కోర్సు, ఎథికల్ హ్యాకింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ అకౌంటెన్సీ, కంప్యూటర్ టైపింగ్, ట్యాలీ, డెటా ఎంట్రీ కోర్సులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9505 800047లో సంప్రదించాలని కోరారు.

